
# సత్యవాక్యము

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH



# మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA_533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం !!

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P 533 001.

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 ఆగష్టు 1991 సంచిక 1

## సంపాదకీయము

### యేసుక్రీస్తే జవాబు

(The Answer is Jesus Christ)

మానవునికి అనేక సమస్యలున్నాయి. సమస్యకు పరిష్కారం కనుగొనుటకు బదులు అతడు జవాబుల కొరకు అనేక స్థలములను వెదకుచు కొన్నిసార్లు మరిన్ని సమస్యలలో చిక్కుకొనుచున్నాడు. దీనికి కారణమేదనగా, అతడు సహాయము కొరకు అసమర్థుల యొద్దకు వెళ్లుచున్నాడు.

సంతోషముతో నేను మీకిచ్చు సలహా ఏమంటే నీ సమస్యలకు, ప్రశ్నలకు జవాబు కావాలంటే యేసుప్రభువు నొద్దకు వెళ్లుము. నీవు ఈ సంగతిని అంగీకరించక పోయినను అదే సత్యము. నీ వెవరో ఆయనకు తెలియును. నీ స్వభావము, నీ తలంపులు, నీ గురి మరియు నీ పాపములు ఆయన ఎరుగును. నీ స్నేహితులు, నీ బలహీనతలు, నీ శోధనలు మరియు నీ సమస్యలు ఆయన మెరుగును. ఇన్ని

ఎరిగిన ప్రభువు నీకెందుకు సహాయము చేయడు? నీవు నీకు సహాయము చేయగల అవకాశమును ఆయనకిచ్చిన యెడల నీకు ఆయన తప్పనిసరిగ సహాయము చేయును. ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు. నీకొరకు ఆయన చనిపోయాడు ఎందుచేతననగా ఆయన నిన్ను ప్రేమించాడు. ఈ లోకమందు మరియు రాబోవు లోకమందు నీవు రక్షింపబడుట సాధ్యపడునట్లు ఆయన ఈలాగు అన్నిటిని నెరవేర్చెను.

మొదటి సంగతి ఏమంటే, లోకమందు అనేక శోధనలున్నాయి. నీవు శోధనకు గురియై నీవు చేయవలసినది చేయలేనపుడు ఎవరు నీకు సహాయము చేయగలరు? యేసుక్రీస్తే జవాబు హెబ్రీ లేఖకుడిట్లు వ్రాసెను. "ఆకాశమండలము గుండ వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు. గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహానుభవము లేనివాడు కాదు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" హెబ్రీ 4 : 14-16. పౌలు ఆదరణ కలిగించే ఈ మాటలను చెప్పెను. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మతగినవాడు. మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" 1 కొరింథీ 10 : 13. పేతురు ఇట్లు చెప్పెను. "భక్తులను శోధనలో నుండి తప్పించుట" ప్రభువునకు తెలియును (2 పేతు 2:9). ఈ వాగ్దానమును ఆయన నిలబెట్టుకొనగలడా? "ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు" 2 పేతురు 3:9.

ధనము మరియు లోకసంబధమైన వాటి విషయమై నీకు సమస్యలున్నాయా? అనేకమంది కిట్టి సమస్యలున్నాయి. నీ కోరికలు, నీ అవసరములు, నీ ఋణముల విషయమేమి? నీవే ఆలోచించుకొనుము. నీవు ముందుగా ఆలోచించుకొని నీకవసరమైన సహాయము కొరకు అన్వేషింపుము. యేసుక్రీస్తే జవాబు. నీవు ఆయనను చూసి ఆయన మాట విని మరియు ఆయన మాటయందు నమ్మిక యుంచిన యెడల నీ సమస్య లన్నిటికిని జవాబును పొందగలవు. నీవు ఆయనతో ఏకీభవించక, ఆయన మాటకు విధేయుడ వగుటకు ఇష్టపడని యెడల ఆయననుండి ఎట్టి సహాయమును పొందలేవు. యేసుప్రభువు చెప్పిన మాటలు వినండి. "భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దాని తినివేయదు,దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును" మత్త 6:19-21. ఆయన ఇంకనూ ఈలాగు సెలవిచ్చెను. "ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును వస్త్రము కంటె దేహమును గొప్పవి కావా! ఆకాశ పక్షులను చూడుడి. అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు. అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటికంటె బహు శ్రేష్టులు కారా? మీలో నెవడు చింతించుటవలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు? వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల? అడవి పువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొకదానివలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు

పొయ్యిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల, అల్ప విశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింప జేయును కదా. కాబట్టి యేమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి. అన్యజనులు వీటన్నిటి విషయమై విచారించుదురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును. రేపటిని గూర్చి చింతింపకుడి. రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును. ఏనాటి కీడు ఆనాటికి చాలును" మత్త 6:25-34. కాబట్టి ఇప్పుడు నీవేమి చెప్పుదువు? నీ సమస్యలకిది జవాబు కాదా? నీ ఆర్థిక పరమైన, భౌతిక సంబంధమైన సమస్యలు పరిష్కారము కానియెడల ఒక విషయమును గుర్తించుము. నీవు భౌతిక సంబంధమైనవాటి నెన్ని సమకూర్చుకొనినను అవి నీకు సంతృప్తి నివ్వలేవు. పైగా అవి అనేకమైన సమస్యలను సృష్టిస్తాయి. ముందు చెప్పినట్లు ప్రభువు సూచించిన మార్గమును నీవు యిష్టపడిన యెడల ఆయన సమస్యలను పరిష్కరించుటలో సహాకరించుము.

యితరుల విషయములో నీకెట్టి సమస్యలయినా ఉన్నాయా? చాలామందికి ఉన్నాయి. మనము నడిచి వెళ్ళునప్పుడు మన దారిలోనే కాదు మన చుట్టు ఉన్నవారి దారిలో మనము నడువవలసి యున్నదను సంగతి మనము గ్రహించవలసియున్నది. యేసుక్రీస్తునొద్ద జవాబు ఉన్నది. ఆయన మాటలు వినండి. "కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగున నే మీరును వారికి చేయుడి" (మత్త 7 : 12). మన కుటుంబములోను, వ్యాపారములోను మరియు జీవితమందలి యితర విషయములలోను ఈ సలహాను పాటించినయెడల అనేక సమస్యలను పరిష్కరించుకొనగలము. మనము తీర్పు తీర్చకూడదని అప్పుడు మనలను గూర్చి తీర్పు తీర్చబడదని క్రీస్తు చెప్పెను (మత్త 7 : 1). తండ్రి మన అపరాధములు క్షమిం

చునట్లు ఒకరినొకరు క్షమించుకొనుడని ఆయన చెప్పెను. మత్త 16 : 14, 15.

పాపము మానవునికి పెద్ద సమస్య. మానవుడు పాపములో నుండుటయే అతని సమస్య లన్నిటికి కారణము. పాపక్షమాపణ పొందికూడ అతడు మరల పాపములోనికి తిరిగి ప్రవేశముచేసి సమస్యలను కలిగి యున్నాడు. కొన్నిసార్లు రక్షణకొరకు మానవుడు మానవుని యొద్దకే వెళ్లుచున్నాడు. మానవుడు తనను తానుగాని యితరులనుగాని రక్షించు శక్తి లేనివాడు. అందువలన అతనియొద్ద జవాబు దొరుకదు. మానవుడు మానవుని వెంబడించుట వలన సమస్య లెక్కువగును. అందువలననే అనేక సంఘములలో, అనేక ఆరాధనా క్రమములు క్రీస్తు నామమున జరుగుచున్ననూ అవి ప్రభువునకు చెందినవి కావు. రక్షణ నిమిత్తమై నీకు సరయిన జవాబు కావాలంటే "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" మార్కు 16:16. నీవు క్రీస్తునకు విధేయుడవై నయెడల ఆయన నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చును. అ.కా. 2 : 47. నీవు దేవుని బిడ్డవై, క్రైస్తవుడవై క్రైస్తవ జీవితమును జీవించుటకు సిద్ధపడుదువు. ప్రభువు సహాయమును కోరుచూ ఆయన సంరక్షణలో మరణము వరకు నమ్మకముగా నుండిన ఆయన వాగ్దానము చేసిన నిత్యజీవమును ఆయన నీకిచ్చును. క్రీస్తుద్వారా తప్ప మరేవిధముగా గాని లేక నీ స్వంత దారినగాని పరలోకాన్ని చేరలేవు.

క్రీస్తే నీ సమస్యలకు జవాబు. ఆయన వాక్యమందు నీ సమస్యలను ఎట్లు ఎదుర్కొనవలెనో ఆయన సూచించియున్నాడు. కొన్ని ఆదరణ కలిగించే క్రీస్తు మాటలు వినండి. "అడుగుడి మీకియ్యబడును. వెదకుడి మీకు దొరకును. తట్టుడి మీకు తీయబడును. అడుగు

ప్రతివాడును పొందును. వెదకు వానికి దొరకును. తట్టువానికి తీయ బడును" మత్త 7 : 7-8.

నీ సమస్య ఏమిటి ! యేసుక్రీస్తే జవాబని
జ్ఞాపకముంచుకొనుము.

---

## యేసునుగూర్చి నీ అభిప్రాయమేమోకాని....

నవయుగంలో నజరేయుడగు యేసునుగూర్చి పలురకాలైన అభిప్రాయాలున్నాయి. సుమారు 2000 సం॥ల క్రిందట బెత్లెహేమను కుగ్రామంలో జన్మించి, జన్మదినాన కనీసం సత్రంలో కూడా స్థలం లేకపోగా, పశువుల తొట్టిలో పరుండబెట్టబడి, నజరేతులో వడ్లవాని యింట పెరిగి, గలిలయ-సముద్రంలో చేపలుపట్టుకొనే జాలరులతో తిరిగి, సమాజంలో త్రోసివేయబడిన సుంకరులకు పాపులకు స్నేహితుడుగా వుండి, అద్భుతరీతిగా ప్రజలకు మేలుచేస్తూ సామాన్య జన సమూహాన్ని ఆకర్షించినా, యూదా మతనాయకులచే ద్వేషింపబడి, నేరస్థుడుగా ఎంచబడి, రోమా సిలువపై ఘోరమును కఠోరమునైన మరణం పొందిన యేసు-ప్రతి తరంలోని జనుల హృదయాలను ఆకర్షించడం విచిత్రంగా లేదా !

ఒక దేశంలోని జనులకో, ఒక భాష మాట్లాడే ప్రజలనో కాదు! ఆయా దేశాల్లో, ప్రతి జనంలో, ఆయా భాషలు మాట్లాడే వారిలో, ప్రతి ప్రజలోని జనుల విశ్వాసాన్ని నజరేయుడగు యేసు యింతకాలం తరువాత కూడా ఆకర్షించగలగడం ఆశ్చర్యంగా లేదా ! పండితులేమి, పామరులేమి, ధనికులేమి, దరిద్రులేమి, శాస్త్రవేత్తలేమి, సంస్కర్తలేమి-యిలా ప్రతి స్థాయిలోని ప్రజలు ఈనాటికీ ఆయన శిష్యులై యుండగోరటం వింత కాదా !

ఒకవైపు విశ్వాసులను ఆకర్షిస్తున్న ఆయన వ్యక్తిత్వం - అటు విమర్శకులను కూడా ఆకట్టుకొంటుంది. ఆయన్ను విమర్శింపగలగడం ఘనంగా కొందరు భావించి, విమర్శకు దిగడం గమనార్హం. వారుచేసే విమర్శలో నమ్మదగిన, మనం నేర్చుకోదగిన వాస్తవాలు ఏవీ లేక పోయినా, విమర్శలు వినిపిస్తునే వున్నారే! ఇలాటి వివాదాస్పదమైన ఆ నజరేయుడెవరు ? ఆ యేసునుగూర్చి నీ అభిప్రాయమేమి ? విశ్వాసివా? విమర్శకుడవా? నీవెవడివైనా దీన్ని ఆలోచించు!

## పలువురి అభిప్రాయాలు

ఆయన అసాధారణమైన మానవుడు గనుక యుగపురుషుడని కొందరి తలంపు. క్రీస్తు దేవుళ్లు అనబడినవారిలో ఒకడని కొందరి భావం. క్రీస్తు క్రైస్తవుల దేవుడని కొందరి ఉద్దేశం. "యేసే దేవుడు" అంటే, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అనే "త్రిత్వం" ఆయనే యని కొందరి విశ్వాసం. అంటే-ఒకప్పుడు తండ్రిగావుండి, కాలక్రమంలో కుమారుడుగా భూమిమీదకు వచ్చాడని; మరణం, సమాధి, పునరుత్థానాల తరువాత ఆయన పరలోకానికి వెళ్ళి, కొద్ది దినాల్లో తిరిగి తానే పరిశుద్ధాత్మగా వచ్చాడని నమ్మకం. అసలు యేసు దేవుడేకాడు; ఆయన కేవలం మానవుడేనని కొందరి అభిప్రాయం. నజరేయుడగు యేసు అనే వ్యక్తి అసలు చరిత్ర పురుషుడే కాడు, తానొక కథలో హీరో మాత్రమేనని కొందరి వాదం. అయినా యిన్ని రకాలైన అభిప్రాయాలను కలిగిస్తున్న ఆ నజరేయుడగు యేసు ఎవరు? ఇంతకు ఆయన్ను గూర్చిన వాస్తవ మేమి? ఇలాటి వివాదం నవయుగంలోనే కలిగిందా? లేక ఆయన జీవించినట్టు చెప్పబడ్డ రోజుల్లోకూడా ఆయన్ను గూర్చిన అభిప్రాయ భేదముందా ?

## శిష్యుల అభిప్రాయం

ఇది నేడేకాదు. ఆయన జీవించిన దినాల్లో కూడ జనులమధ్య

పలు రకాలైన అభిప్రాయములుండెను. "యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతమునకు వచ్చి-మనుష్యకుమారు డెవడని జనులు చెప్పుకొను చున్నారని ఆయన తన శిష్యుల నడుగగా వారు-కొందరు బాప్తిస్మ మిచ్చు యోహానననియు, కొందరు ఏలీయాయనియు కొందరు యిర్మియా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నా రనిరి. అందుకాయన-మీరైతే నేనవడనని చెప్పుకొనుచున్నారని వారినడిగెను. అందుకు పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు అని చెప్పెను. అందుకు యేసు-సీమోనుబర్ యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపర చెనే గాని నరులు (రక్త మాంసములు) నీకు బయలుపరచలేదు—" అని అతని సమాధానమును అభినందించి, యూదులుగాని, అన్యజనులు గాని తన నోటనే తొలిగా సువార్త వినేలా ఆధికృతను అతనికిచ్చారు (మత్తయి 16:13-19).

## సాక్షులు చెప్పింది

అలాటప్పుడు యేసును గూర్చి నీ అభిప్రాయ మెట్టిదైనా, ఆయనకు సాక్షులుగా నిలిచినవారి సమాచారాన్ని విందాం. సాక్షు లంటే-సంగతులు లేక సంభవాలు జరుగుచూ వుండగా చూచినవారు, విన్నవారు మాత్రమే సుమా! అలా కానివారు కూటసాక్షులు. అందు వలన కూటసాక్షుల మాటలుగాక ఆయన అపొస్తలుల మాటలను విందాం. అపొస్తలులు చూచింది భ్రమకాదు; వారు విన్నది భ్రాంతి కాదు (1 యోహాను 1:1-2; అపొ. 10:38-40). పైగా ఆయనకు సాక్షులైనవారు తాము ప్రకటించిన తమ ప్రభువుకోసం అసువులను సహా అర్పించారు. అది విస్మరింపలేని సత్యం. సామాన్యంగా యిద్దరు నమ్మదగిన సాక్షులుంటేనే ఏ డాక్యుమెంటయినా చెలామణి యాతుంది. అలాటప్పుడు కనీసం పన్నెండు మంది సాక్షులు ఒకే వాస్త వాన్ని చూపిస్తూవుంటే, దాన్ని సందేహించడం అర్థరహితంకాదా!

నమ్మదగిన సాక్షుల్లో ఒకడు ఆయన్ను గూర్చి యిలా అన్నాడు : "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి ఈ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు. గాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30-31). పరమందున్న తండ్రి తన కుమారునిగూర్చి యిచ్చిన సాక్ష్యం కూడా యిట్టిదే! (మత్తయి 3:16-19; 17:3-5).

"యేసు దేవుని కుమారుడైన క్రీస్తు" అంటే-నీకు ఎలాంటి తలంపులొస్తాయో గాని, దేవుని కుమారుడంటే-దైవమని; దేవునితో సమానుడనే భావాలే ఆనాటి జనులకొచ్చాయి. ప్రభువైన యేసు మాట్లాడుచుండిన ఒకానొక సందర్భములో, ఆయనకు విరోధంగా ఆలోచించే యూదులకు సయితం యిలాంటి భావమే వచ్చింది. అందుకు వారు ఆయన్ను రాళ్ళతో కొట్టబోయారు! "ఏ క్రియ నిమిత్తము నన్ను రాళ్ళతో కొట్టుదురని" ఆయన వారి నడిగారు. "అందుకు యూదులు-నీవు మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు. గనుక దేవదూషణ చేసినందుకే నిన్ను రాళ్ళతో కొట్టుదుమనిరి" (యోహాను 10:31-33).

ఏది ఎలాగున్నా, ఒకటి మాత్రం వాస్తవం. అదేమంటే-యేసే తండ్రియైన దేవుడని ఆయన శిష్యులు తలంచలేదు. ఆయనకు విరోధంగా నిలిచియుండిన యూదులు సయితం అలా అనుకోలేదు. ప్రభువైన యేసుకూడా అలాంటి భావనను వారిమధ్య వ్యక్తపరచలేదు. పైగా. "నా తండ్రి నాకంటే గొప్పవాడంటూ" యేసు తండ్రియైన దేవునిగూర్చి తెలిపి, తండ్రిని మహిమపరచాడేగాని, ఆ మహిమను యేసు ఎన్నడూ కోరలేదు (యోహాను 14:28; 10:29).

## దేవుని కుమారుడు, నిత్యుడు

"నేనును తండ్రియు ఏకమై యున్నామని" ప్రభువైన యేసు చెప్పిన మాట వాస్తవమే అయినా వారి వ్యక్తిత్వపు ఏకత్వాన్ని ఆయన అక్కడ సూచింప బూనుకోలేదు. అంటే-"తండ్రి అనే వ్యక్తిని నేనే"-అని యేసు మాట్లాడలేదు. అయితే "తండ్రి, కుమారుడు" అనే వారి తత్వం యొక్క ఏకత్వాన్ని ఆయన అక్కడ బయలుపరచారు (యోహాను 10:30; 17:20-21) అంటే-తండ్రివలె కుమారుడు నిత్యుడే: తండ్రియైన దేవునివలె క్రీస్తుప్రభువు కూడా దేవత్వం కలిగినవాడే (యోహాను 14:5; 1:1-3), అయితే వ్యక్తులుగా వారు ఒకరై యుండక వారిద్దరు వేరై యున్నారు. అందుకే—"అద్వితీయ సత్య దేవుడవైన నిన్నును నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్య జీవమని" ప్రభువు వివరించారు (యోహాను 14:3).

తండ్రియైన దేవునితోను, ప్రభువైన యేసుక్రీస్తుతోను (1 కొరింథీ 8:5-6), దేవత్వాన్ని పంచుకొన్న మరియొక వ్యక్తి కూడా వున్నారు. ఆయన పరిశుద్ధాత్మ (అపొ. 5:3, 5). పరిశుద్ధాత్మను గూర్చి ప్రభువైన యేసు మాట్లాడుతూ యిలా అన్నారు:— "నేను తండ్రిని వేడు కొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన (తండ్రి) వేరొక ఆదరణ కర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీ కనుగ్రహించును" (యోహాను 14:16). పరిశుద్ధాత్మ నావంటి మరియొకడు అని ప్రభువు స్పష్టముగా తెలిపారు. ఆ సందర్భంలో "Allos" అనే గ్రీకు పదప్రయోగం ఈ సంగతిని సూచించింది పైగా ప్రభువైన యేసు తన అపొస్తలులతో యిలా అన్నారు. "నేను వెళ్ళిపోవుటవలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్ళని యెడల ఆదరణకర్త మీ యొద్దకురాడు. ..." (యోహాను 16:7).

## త్రిత్వంలో వ్యక్తి

అన్నిటి కంటే మరి ప్రత్యేకంగా-తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అనే ఈ ముగ్గురు వ్యక్తులు యేసు బాప్తిస్మం పొందిన సమయంలో తేటగా కన్పిస్తారు. యేసు నీళ్ళలోనుండి పైకి వస్తున్నారు. ఆకాశం తెరువబడింది. పరిశుద్ధాత్మ పావురం ఆకారంలో ఆయన మీదికి దిగివచ్చారు. అదే సమయంలో పరలోకంనుండి తండ్రి యేసునుగూర్చి "ఈయన నా ప్రియకుమారుడవి..."పలికారు(మత్తయి 3:16-17) గనుక "యేసే-తండ్రి, కుమార పరిశుద్ధాత్మ అనే త్రియేక దేవుడు; ఆయనే ఈ మూడు రూపాలుగా ప్రత్యక్షమయ్యాడ"నేది చమత్కారంగా కల్పించిన కథలా వుంది!!

ఆయన సాక్షులకు అలాటి భావన లేదు. వారిలో ఒకడు యిలా అంటున్నాడు: "ఏలయనగా చమత్కారముగా కల్పించిన కథలను అనుసరించి మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క శక్తిని ఆయన రాకడను మేము మీకు తెలుపలేదు గాని ఆయన మహాత్మ్యమును మేము కన్నులార చూచినవారమై తెలిపితిమి. ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహా దివ్యమహిమనుండి ఆయన యొద్దకు వచ్చినప్పుడు, తండ్రియైన దేవుని వలన ఘనతయు మహిమయు ఆయన (యేసు) పొందగా మేము ఆ పరిశుద్ధ పర్వతముమీద ఆయనతో కూడ ఉండిన వారమై ఆ శబ్దము రాగా వింటిమి" (2 పేతురు 1:16-18).

ఏది ఎలాగున్న, దేవత్వాన్ని (ఫిలిప్పీ 2 : 6); నిత్యత్వాన్ని (యోహాను 17 : 5), సృష్టి నిర్మాణ కార్యక్రమాన్ని (కొలస్సీ 1:15-16; యోహాను 1:1-3) ప్రభువైన క్రీస్తు తండ్రి తాను, పరిశుద్ధాత్మ తాను పంచుకొన్న కారణాన్ని బట్టి అపొస్తలులు ఆయన్ను— "సర్వాధికారియైన దేవుడై యుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడనీ" (రోమా 9:5); "మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తనీ"

(తీతు 2 : 13); నిజమైన దేవుడును నిత్యజీవమునై యున్నాడనీ" (1 యోహాను 5:21) వివరించారు. లోకాన్ని సృజింపకముందు ప్రభువైన యేసు రక్తమాంసాల్లో లేరు ఆయన దేవుని స్వరూపము కలవాడై యుండి-దేవునితో సమానంగా ఉండే వారు (ఫిలిప్పీ 2:6).

## నరావతారి

దైవరూపంలో దేవుణ్ణి ఎవడూ, ఎన్నడూ చూచియుండలేదు (యోహాను 1:18). ఆయన ఆత్మ (యోహాను 4:24). గనుక అదృశ్యుడు (రోమా 1:20). అదృశ్య దేవునితో సహవాసం చేయగోరిన నరుడు వాస్తవంగా విశ్వాసంతోనే దేవుని సంధించాలి! (హెబ్రీ 11:6). అయితే దేవుని దృశ్యునిగా చేసుకొని ఆయనతో నరుడు సహవాసం చేయబూని తన ప్రయాసల్లో వ్యర్థుడై, దేవునికి దూరంగా తొలిగిపోయాడు (రోమా 1:21-28). అలాంటి పరిస్థితుల్లో దేవుడు తానే నరులకు తన్నుతాను ప్రత్యక్షపరచుకో గోరితే, క్రీస్తు యేసు దానికి సాధనంగా మారాడు (యోహాను 3:16;1:18). శరీరధారియైన క్రీస్తు అదృశ్యదేవుని స్వరూపియై, సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు (కొలస్స 1:15). దేవత్వముయొక్క సర్వ పరిపూర్ణత శరీరంగా క్రీస్తునందు నివసించింది (కొలస్సీ 2:9). ఎవడైనా అదృశ్యుడగు ఆత్మ స్వరూపిని చూడగోరితే, క్రీస్తుయొక్క వ్యక్తిత్వంలో ఆయన్ను చూడవచ్చు. దేవుని ప్రేమను ఆయనయందు కనుగొనవచ్చు. అదృశ్యుడగు దేవుడు ఒకవేళ రక్తమాంసాల్లో ప్రవేశించితే ఎలాప్రవర్తిస్తాడో; ఎలా ప్రేమిస్తాడో; ఎలా కార్యాలను జరిగిస్తాడో శరీరధారియైన క్రీస్తు ఆలాగే కనుపరచారు. అందుకే "తండ్రిని మాకు కనుపరచుము" అని అడిగిన ఫిలిప్పుతో ఆయన—"ఫిలిప్పా నేను యింతకాలము మీ మధ్య ఉండినను నీవునన్ను ఎరుగవా! నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడని..." వివరించారు (యోహాను 14:8-10).

దైవ సహవాసం కావాలనుకొంటే-ప్రభువైన క్రీస్తునొద్దకు రావాలి. ఆయన మన విమోచనకై సమస్త కార్యాలను జరిగించు వాడు. ఆయన శరీరమునుబట్టి దావీదు సంతానంగాను, మృతులలో నుండి పునరుత్థానుడై నందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావంతో రుజువు చేయబడ్డాడు (రోమా 1:4). విమోచనా కార్యక్రమాన్ని సిలువ, మరణ, సమాధి, పునరుత్థానాలద్వారా ముగించి ఆయన నేడు తండ్రియైన దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడై యున్నాడు. ఆయనకు ఆధిపత్యం, అధికార మియ్యబడింది (దాని 7:13-14). మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొంది, తన రాజ్యనివాసులుగా భూమిమీద వున్న తన జనులను ఏలుతూ, వారి పక్షంగా పరములో తండ్రి సముఃఖంలో యాజకత్వం చేస్తున్నాడు (అపొ. 2 : ). ప్రస్తుతం భూపతులకు అధిపతియు ఆయనే. సజీవులకును మృతులకును తీర్పు తీర్చడానికి ఆయన చివరిగా ప్రత్యక్షమౌతాడు. అంతవరకు ఆయన రాజ్యపాలన చేస్తూ వుంటాడు. నేడు నీవు ఆయన అధికారంలో నిలిచియుంటే జీవంలో ప్రవేశిస్తావు. క్రీస్తు దేవుని కుమారుడే సుమీ!

—G. దేవదానం, మద్రాసు-12.

---

## నీవు అంగీకరింపబడితివా ?

"ప్రభువా, మేము చేయు ప్రతి పని, తలంపు నీ దృష్టికి అంగీకార యోగ్యంగా వుండేలాగున మమ్ములను దీవించు" మని సర్వ సాధారణంగా మనందరము దేవునికి ప్రార్థన చేస్తుంటాము. దేవుడు మానవుని తనకు అంగీకార యోగ్యంగా వుండాలనే ఎల్లపుడు కోరుకుంటాడు. తన బిడ్డలు తనకు నచ్చిన విధంగా, తాను మెచ్చిన రీతిగా

ప్రవర్తిస్తుంటే చూచి ఆనందించాలని ప్రతి తండ్రి ముచ్చట పడుతుంటాడు. అట్లే పరలోకమందున్న అందరి ఆత్మీయ తండ్రి తనకు యిష్టులుగను, అంగీకార యోగ్యముగాను మెలగాలని ఆకాంక్షించును.

దేవునిచే అంగీకరింపబడుటకు మానవుడు కొన్ని యోగ్యతలను కలిగి యుండాలి. దేవునిచే ప్రేమింపబడాలి; ఆయనచే ప్రతి క్రియ అంగీకరించాలి.

## 1. ప్రేమింపబడాలి

మానవుడు దేవునిచే అంగీకరింపబడాలంటే మొదటిగా ఆయనచే ప్రేమింపబడాలి. మనము ఆయనకు ఏమయిన యిచ్చి ప్రేమ పొందగలమా? "ముందుగా ఆయన కిచ్చి ప్రతి ఫలము పొందగలవాడెవడు" (రోమా 11:35). మనలో ఏమయిన అర్హత చూచి ఆయన మనలను ప్రేమించునా? "నీ చేతి పనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్ర నక్షత్రములను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు! నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు?" (కీర్తనలు 8:3, 4) పోని మానవుడు నీతిమంతుడా? "పాపము చేయక మేలు చేయుచుండు నీతిమంతుడు భూమిమీద ఒకడైనను లేడు" (ప్రసంగి 7:20). "కావున అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నా" (రోమా 3:23) రనునది సత్యం. దీనిని బట్టి ఏ ఒక్కరూ దేవుని ప్రేమకు అర్హులు కారని అర్థమవుచున్నది. అట్లయిన దేవుడు ఏ మానవుని అంగీకరింపలేదు గదా! కాబట్టే దేవుడు తన ఉచితమైన కృపచేత మనలను తానే మొదటిగా ప్రేమించెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను" (యోహాను 3 : 16). "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను ఇందులో ప్రేమ యున్నది" (1 యోహాను 4:10).

## 2. క్రైస్తవునిగా పిలువబడాలి :

మన తండ్రియైన దేవుడు ప్రతి మానవుని తన బిడ్డగా అంగీకరించుటకు సిద్ధపడి యున్నాడు. ఏ దేశంవాడైన, ఏ జాతివాడైన, ఏ కులంవాడైన ఘనులేమి సామాన్యులేమి స్త్రీ పురుష భేధం లేకుండా అందరూ క్రైస్తవులగుటకు అర్హులే. "తన్ను ఎందరంగీకరింతురో వారికందరికి, అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" (యోహాను 1:12).

ఒకడు దేవునిచే అంగీకరింపబడాలంటే విధిగా క్రైస్తవుడు కావలయును. అనగా అతడు యేసుక్రీస్తు నామమున రక్షణ పొందాలి. "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అ. కార్య. 4:12). రక్షణ పొందుటకు తద్వారా క్రైస్తవ నామాన్ని ధరించుటకు తప్పనిసరిగా ఈ క్రింది నాలుగు సూత్రాలను పాటించాలి.

a) విశ్వసించాలి : ఈ విశ్వాసము క్రీస్తును గూర్చిన సువార్త వినుటవలన వచ్చును (రోమా 10 : 17). ఈ విశ్వాసము లేకుండ దేవునికి యిష్టుడు కాలేరు అనగా దేవునిచే అంగీకరింపబడనేరరు. విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువారు ఆయన ఉన్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా! (హెబ్రీ 11:6). రక్షింపబడుటకు యేసు దేవుని కుమారుడని విశ్వసించాలి (యోహాను 8:24).

b) మారుమనస్సు పొందాలి : దేవునిచే అంగీకరింపబడుటకు మారుమనస్సు అతి ముఖ్యం. అనగా గతంలో వున్న విగ్రహ

పూజలనుండి; పాపపు జీవితమునుండి మనస్సు త్రిప్పుకొనుట యని అర్థము. ఎందుకనగా అవన్నియు దేవుడు నిన్ను అంగీకరించుటకు అడ్డంకులు.

“మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను; మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను” (యెషయా 59:2). “మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను” (మత్తయి 18:3) అని యేసుక్రీస్తు చెప్పెను. అనగా మారు మనస్సు పొందకపోయిననూ మనము అంగీకరింపబడము. పైగా పరలోక రాజ్యములో ప్రవేశించలేము. “ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు” (అ.కార్య. 17 : 30).

c) ఒప్పుకోవాలి : యేసుక్రీస్తే ప్రభువని; ఈయనే సజీవుడైన దేవుని కుమారుడని ఒప్పుకోవాలి. అట్లు ఒప్పుకొనిన వారినే దేవుడు అంగీకరిస్తాడు. యేసుక్రీస్తే ప్రభువని మన నోటితో ఒప్పుకొనవలయును (రోమా 10:9, 10). ఎందుకనగా క్రీస్తు యిట్లు చెప్పుచున్నాడు. “మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును” (మత్తయి 10 : 32) అనగా యేసుక్రీస్తును ప్రభువని రక్షకుడని మన పాపములను విమోచించుటకు ఈ లోకమునకు వచ్చెనని (1 తిమోతి 1:15); ఆయన దేవుని కుమారుడని ఒప్పుకొంటేనే గాని పరలోకములోని మన తండ్రి మనలను అంగీకరింపడని అర్థమగుచున్నది.

## బాప్తిస్మము పొందాలి :

ఒకడు పాపక్షమాపణ నిమిత్తము తండ్రి కుమార పరిశుద్ధాత్మ లోనికి బాప్తిస్మము పొందితేనే గాని దేవునిచే అంగీకరింపబడడు. క్రీస్తు యిట్లు చెప్పెను. "తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు; పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి" (మత్తయి 28 : 19, 20). పేతురు ఇట్లు బోధించెను. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అ. కార్య. 2:38). ఈ క్రియ చేయని వారెటువంటివారైనను దేవుని దృష్టికి అయోగ్యులే; ఆయన వారిని అంగీకరింపడు. బాప్తిస్మము పొందినవారు క్రీస్తు నామమును ధరించుకొని క్రైస్తవులని పిలువ బడుదురు. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు (గలతి 3 : 27). మొట్టమొదట అంతియొ కయలో శిష్యులు క్రైస్తవులనబడిరి (అ. కార్య. 11:26). ఈ విధ ముగా క్రైస్తవులయిన వారందరు దేవునిచే అంగీకరింపబడుదురు.

[సశేషం] —B. సుధాకర్, కాకినాడ.

## ఆరాధనలోని ఆనందం

### ( కీర్తన 84 పై ధ్యానము )

ఆదివారమున క్రైస్తవులు యేమి చేయుచున్నారు? కొందరు తుపా కితో వేటాడుటకును, చిన్నచిన్న పడవలలో షికారు చేయుటకును, కుటుంబములతో వినోదపర్యటన చేయుటకును, పేకాట ఆడుటకును, టివిలోని సినిమాలు చూచుటకును, గుర్రపు పందెములలో పాల్గొను టకును, బంధువులను పరామర్శించుటకును పూనుకొనుచున్నారు.

క్రైస్తవులను క్రైస్తవేతరులు గమనింప గోరుచున్నారు. కొందరు ఆరాధనకు వెళ్ళుదురు కాని తొందర తొందరగా ఆరాధన ముగియ వలెనని కోరుదురు. యింటికి పోయి T.V. లో సినిమాగాని, పందెము లనుగాని చూడవలెనని ఆశపడుదురు. ప్రసంగీకులు క్లుప్త ప్రసంగములు చేయవలెనని కోరుదురు. పాటలు పాడునపుడు మొదట వచనము చివరి వచనము పాడితే చాలునని ఆశింతురు. స్తుతించుట మనఃపూర్తిగా కోరరు, ప్రారంభమున ప్రార్థించునపుడున్న ఆశ చివరి ప్రార్థన చేయుచున్నపుడు క్లుప్తముగా చేయవలెనని కోరుదురు. ఆఖరి ప్రార్థనలో ఆమెన్ అనునపుడు వెంటనే లేచి తలుపుయొద్దకు వెళ్ళిపోవుదురు. ఆరాధన యెపుడు ముగిసిపోవునా యని ఆశింతురు.

ఆరాధనయెడల మీ అభిప్రాయము యేమైయున్నది? కీర్తనలు పాడుటకు ఆశింతురా, ప్రార్థన చేయునపుడు యేకీభవింతురా, దేవుని వాక్యము చదివి, ధ్యానించుచున్నపుడు నీ హృదయము ఆనందించు చున్నదా? "నీ మందిరమునందు నివసించువారు ధన్యులు. వారు నిత్యము నిన్ను స్తుతించెదరు వారు నానాటికి బలాభివృద్ధి నొందుచు ప్రయాణము చేయుదురు. వారిలో ప్రతివాడును సీయోనులో దేవునిసన్నిధిని కనబడును" (కీర్త 84:4, 7). యీమాటలు మనలనుగూర్చి చెప్పబడెనా? యెహోవా మందిరావరణ మును చూడవలెనని మనము క్రైస్తవ సహవాసమును అపేక్షించుచున్న జీవము గల దేవుని దర్శించుటకు నా హృదయమును, నా శరీరమును ఆనందముతో కేకలు వేయు చున్నది. (కీర్త 84:2). ఆరాధించుటకు క్రైస్తవుడు ఆతురతతో యెదురు చూచుచున్నాడు. ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెనని దేవుడు కోరుచున్నాడు (యోహాను 4:24). దేవుని వాక్యములోని వెలుగును, సత్యమును తెలుసు కొనవలెనని కోరిక కలదా? "అవి నీ పరిశుద్ధ స్థలమునకును, నీ నివాస

స్థలమునకును నీ వన్ని తోడుకొని వచ్చును" అని దావీదు పలుకు చున్నాడు (కీర్త. 43 : 3).

## ఆరాధనకు ఆసక్తి

ఆరాధనా స్థలము కొంచము దూరమున్న యెడల క్రైస్తవులు దూరస్థలమునకు వెళ్ళుటకు వెనుకాడుదురు. అ. కా. 8 : 27లో నపుంసకుడు ఐతియోపియ దేశమునుండి ఆరాధనకొరకు యెరూష లేము వెళ్ళి తిరిగి వచ్చుట మనము చూడగలము. ఆరాధన అంటే మనకు అంత ఆసక్తి కలదా! పౌలు వ్రాయుచున్నాడు. "కొందరు మానుకొనుచున్నట్లుగా, సమాజముగా కూడుట మానుకొనక, ఒకని నొకడు హెచ్చరించుకొనుచు ఆ దినము సమీపించుట మీరు చూచు కొలది మరియెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యము చేయుటకును ఒకని కొకడు పురికొల్పుకొన వలెనని ఆలోచింతము" (హెబ్రీ 10 : 24, 25). మనము సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా ఆరాధన నిర్లక్ష్యము చేయరాదు.

## సరియైన మన స్తత్వ మవుసరం

శరీర సుఖమును ఆశించి, యింటివద్ద కాలక్షేపము చేయుట పాపము అయియున్నది. క్రైస్తవుడయిన తరువాత నిజమగు ఆరాధన యొక్క ఆవశ్యకతను గ్రహించి, యితరులను కూడా ప్రోత్సాహపర్చ వలసి యున్నది. కొందరు ప్రార్థనచేయుట మనకు యిష్టముండదు. సంగీత వాయిద్యములు లేని పాటలు పాడుట వినసొంపుగా ఉండదు, ఆరాధనలో తప్పు పట్టుకొందుము. ప్రసంగీకుని నిందించెదము. కావున ఆరాధనయెడల మన మన స్తత్వము యెట్టిదై యున్నది? ఆరాధన స్థలమునకు ఆనందముతో మనము పరుగెట్టుచున్నామా లేక యధా

విధిగా, సోమరితనముతో నిర్లక్ష్య భావముతో వెళ్ళుచున్నామా? “యెహోవా మందిరావరణమును చూడవలెనని నా ప్రాణము యెంతో ఆశపడుచున్నది. అది సొమ్మసిల్లుచున్నది, జీవముగల దేవుని దర్శించుటకు నా హృదయమును నా శరీరమును ఆనందముతో కేకలు వేయుచున్నది” అని దావీదు వ్రాయుచున్నాడు (కీర్తన 84 : 2).

దేవుని మందిరమునందు నివసించువారు ధన్యులు. వారు నిత్యము ఆయనను స్తుతించుదురు. నీవలన బలము నొందు మనుష్యులు ధన్యులు (కీర్తన 84:4, 5). మందసము పెట్టె ప్రత్యేక గుడారమునందు దించబడి యున్నది. ఇశ్రాయేలీయులకు అది పవిత్రమగు ఆరాధన స్థలమై యున్నది. దావీదు తన కుమారుడైన అబ్షాలోము తిరుగుబాటుచేసినపుడు యెరూషలేమునుండి కొండలలోనికి పారిపోయినపుడు కోరహు కుమారులు యీ కీర్తన వ్రాసియున్నారు.

## నిజమైన ఆనందం

మనము జీవితములో చివరకు వచ్చినపుడు మనము ఆనందించిన ఘడియలు యేవని మనము తలంచినచో, మన స్నేహితులతో భోజనములు, విందులు ఆరగించిన సమయము కాదు. వినోదములలో ఆనందించిన సమయము కాదు. ఒక సత్ గ్రంథమును పఠించిన కాలమును కాదుగాని, దైవసాన్నిధ్యములో ఆయన సహవాసములో శ్రేష్ఠమైన ఘడియలు అని గ్రహింతుము. మీ గృహములో ఆయన పాద సన్నిధిని గడిపిన ఘడియలు పవిత్రమైనవి. నా ఆత్మీయ సహవాసంలో ఆయన పాదసాన్నిధ్యంలో ఆరాధించిన ఘడియలు పవిత్రమైనవి. ఆయన సన్నిధిలో ఒక్క దినము గడుపుట వేయిదినములకంటె శ్రేష్టము. లోకసంబంధముగా యెన్ని శుభ ఘడియలు గడిపినా, దైవసాన్నిధ్యంలో ఒక దినము గడుపుటకు సాటిరావు లోకములో

మనకు లభించే గౌరవము, స్నేహితులతో గడిపే సంతోష సమయము దైవసాన్నిధ్యములో గడిపే పవిత్ర సమయమునకు సరికావు. ఈ జీవితములో మనము గడిపే సమయ మంతటికన్న మిన్నయైన అనుభవము యేది? దైవ సన్నిధిలో మనము గడిపే సమయమే కదా! జీవితంలో మనము సంపాదించే బహుమానములు గౌరవప్రదమైన బిరుదులు, దైవసన్నిధిలో మనము గడిపే సమయమునకు సరికావు కదా! మనము తుది శ్వాస పీల్చునపుడు, జీవితంలో మనము ఆయన సన్నిధిలో గడిపిన సమయమే బహు విలువైనది గదా అని విలియంలా అనే ఆయన అన్నాడు.

## మేలు చేయక మానడు

దేవుడైన యేసు సూర్యుడును, కేడెమునై యున్నాడు. యెహోవా కృపయు ఘనతయు అనుగ్రహించును. యథార్థముగా ప్రవర్తించువారికి ఆయన యే మేలును చేయకమానడు. సైన్యముల కధిపతియగు యెహోవా యందు నమ్మిక యుంచువారు ధన్యులు (కీర్తన 84 : 11, 12). సూర్యుడు, వెలుతురు, వేడిమి శక్తి, కాంతిని అనుగ్రహించును. ఆయన కాపాడువాడు, నీతిమంతులకు ఆయన సమస్త మేళ్ళను అనుగ్రహించును. మనము నీతిమంతులముగా నడిచిన యెడల ఆయన మనలను దీవించును.

దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు, తన స్వంత కుమారుని అనుగ్రహించుటకు వెనుకదీయక, మన అందరి కొరకు ఆయనను అప్పగించినవాడు. ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకు యెందుకు అనుగ్రహింపడు? (రోమా 8 : 32). మీ పాపములు మీకును దేవునికిని అడ్డముగా వచ్చెను అని యిర్మీయా చెప్పుచున్నాడు (యిర్మీయా 5:25). దేవుని

దీవెనలు మనకు కలుగకుండునట్లు పాపము మనలను దేవునికిని గోడ వలె అడ్డుగాయున్నది. యావనస్థులతో పెద్దలుగాని తల్లిదండ్రులుగాని, ఫలాన పని చేయవద్దు. ఫలాన స్థలమునకు పోవద్దు అని చెప్పినపుడు— అది వారి మంచికొరకే చెప్పుచున్నారుగాని, వారి స్వతంత్రతను అడ్డగించుటకుకాదు వారికి మేలు కలుగుటకే చెప్పుచున్నారు. శోధనకరమైన స్థలములను దర్శించుట, చేయవద్దన్న పనులు చేయుట వారికి క్షేమకరముకాదు, చివరిగా దేవుని ఆరాధింపక, దైవసన్నిధిని తృణీకరించి తిరుగు వారిని గూర్చి చెప్పుచున్నాడు. మానసికముగాను ఆత్మీయముగాను మన సమస్తములో దేవుని ఆరాధించుచున్నామా?

"యెహోవా మందిరమునకు వెళ్ళుదమని జనులు నాతో అనినప్పుడు నేను ఆనందించితిని" (కీర్తన 122 : 1). దైవ సన్నిధిలో మోకాళ్ళూని దేవుని ప్రార్థించు దృశ్యము యెంత సుందరమైనది! తమ దేవుని కుటుంబము అంతటితో ఆరాధించు వారు ఎంత ధన్యులు! అయితే యదార్థముగా ఆరాధించువారు, ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు ఘడియ వచ్చియున్నది. అది యిప్పుడే వచ్చి యున్నది. తన్ను ఆరాధించు వారు అట్టివారు కావలెనని ఆయన కోరుచున్నాడు (యోహాను 4 : 21-23). ప్రియుడా! నీవు ఆరాధించుచున్న ఆరాధన యెట్టిదై యున్నది? దేవుని హృదయపూర్వకముగా ఆత్మతో సత్యముతోను ఆరాధించుచున్నావా?

— కె. జీవానందం, అనకాపల్లి.

---

## మద్యపానము చేయవచ్చునా?

ఈనాడు మానవుని పీడించి పాడుచేసే దుర్వ్యసనములలో మద్యపాన మొకటి. మద్యపానమువలన మానవుని ఆరోగ్యం క్షీణించి

ఆర్థిక, సాంఘిక అభివృద్ధి కుంటుపడుతుంది. మద్యమును సేవించు వ్రతి మనిషి ఆయుస్సు తగ్గిపోతుంది. త్రాగుబోతులైన వ్యక్తులు ఎంత ఉన్నత విద్యావంతులైనను, పెద్ద పెద్ద పదవులను కల్గియున్నప్పటికిని సమాజము వారికి యిచ్చే గౌరవము చాలా తక్కువ.

ఒకప్పుడు అంధకార సంబంధులై యేసును ధరించుకొనిన కొందరు క్రైస్తవులు మద్యపానము చేయుట చాలా నికృష్టము. "వారు నీతిమార్గమును అనుభవ పూర్వకముగా తెలుసుకొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుట కంటె ఆ మార్గము అనుభవ పూర్వకముగా తెలియక ఉండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగినట్టును కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను. (II పేతురు 2 : 21-22) (లేవీ 10:8, 9) (సంఖ్యా 6 : 3; న్యాయా 13 : 14).

## 1. మద్యపానము బుద్ధిహీనులుగా చేయును :—

"మద్యము త్రాగుదమని వేకువనే లేచి ద్రాక్షారసము తమకు మంట పుట్టించువరకూ చాలా రాత్రివరకు పానము చేయువారికి శ్రమ (యెషయా 5 : 11) మద్యపానము చేయువారికి చిన్న మెదడు అదుపు తప్పి సరిగా పనిచేయదు. వారి కుటుంబముల ఆర్థిక పరిస్థితి దెబ్బతిని వారి పిల్లలకు సరిపడ్డ తిండి, బట్ట, చదువు వీరు సమకూర్చలేరు. త్రాగుబోతుల పిల్లలు క్రమ శిక్షణాలేక చెడుమార్గములకు వెళ్ళు అవకాశము ఎక్కువ కాతము కలదు. మద్యపానము చేయువారు దేవుని రాజ్యమునకు వారసులు కారు. వారికి శ్రమ కలుగును. తీర్పు దినమున వారు తత్తరపడుదురు. "మద్యమువలన తత్తర పడుదురు. యాజకులేమి ప్రవక్తలేమి అందరును మద్యమువలన సోక్క

సోలుదురు. ద్రాక్షరసము వారిని మ్రింగివేయుచున్నది. మద్యము వలన తత్తరపడుచున్నారు. దర్శనము కలుగునప్పుడు సోలుదురు తీర్పు కాలమున తత్తరపడుదురు. వారి భోజనపు బల్లలన్నియు వాంతితోను కల్మషములతోను నిండియున్నవి. అవి లేనిచోటులేదు" (యెషయా 28 : 7-8, ఆమోసు 6 : 7, యోవేలు 1 : 5). ఇప్పుడైతే, సహోదరుడనబడిన వాడెవడైనను జారుడుగాని లోభిగాని విగ్రహారాధికుడుగాని తిట్టుబోతుగాని త్రాగుబోతుగాని దోచుకొనువాడుగాని అయియున్నయెడల, అట్టి వానితో సాంగత్యము చేయకూడదు భుజింపకూడదని మీకు వ్రాయుచున్నాను". అని భక్తుడు అపొస్తలుడైన పౌలు దేవాత్మద్వారా ప్రకటించెను (1 కొరింథీ 5:11, 6:10) "దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు". అని దైవ లేఖనములు విశదీకరించెను.

మోషే ధర్మశాస్త్ర ప్రకారము త్రాగుబోతులను రాళ్ళతో కొట్టి చంపేవారు (ద్వితి 21 : 20-21). "ద్రాక్షరసము వెక్కిరింతల పాలు చేయును మద్యము అల్లరి పుట్టించును" (సామె 20:1). త్రాగుబోతులు మందదృష్టి కలిగియుందరు. వారు నిషాలో గొడవలు పెట్టుకొని లేనిపోని అల్లరులుచేసి పెద్దపెద్ద వివాదములు పెట్టుకొని హత్యలు కూడా చేయుదురు. మరికొందరు బాగాత్రాగి వాహనములు నడిపి యాక్సిడెంట్సుకు గురియగుదురు (సామె 23:29-25).

## 2. మద్యపానము మంచి నడవడిని పాడుచేస్తుంది :—

నల్లమందు, గంజాయి, బ్రౌన్‌షుగర్, మొదలగు మత్తు పదార్థములు తినుటవలన, బ్రాందీ, విస్కీ, సారాయి, విప్పసారాయి, మొదలగునవి త్రాగుటవలన వస్త్రహీనులుగా ఉండు పరిస్థితులు ఏర్పడును. దేవుని దృష్టియందు కృప పొందినవాడైన నోవహు ద్రాక్షారసము త్రాగి మత్తుడై తన గుడారములో వస్త్రహీనుడుగా నుండెను.

అప్పుడు షేమును యాపెతును వస్త్రమొకటి తీసుకొని తమ యిద్దరి భుజములమీద వేసుకొని వెనుకకు నడిచివెళ్ళి తమ తండ్రి దిస మొలను కప్పిరి (ఆది 9:20-24).

రాజగు బెల్షరు తన వెయ్యిమంది యధిపతులకు గొప్ప విందు చేయించి ఆ వెయ్యిమందితో కలిసి దేవుని ఆలయములోనుండి సువర్ణోపకరణములను తెచ్చి యుంచగా, రాజును అతని యధిపతులును అతని రాణులును అతని ఉపపత్నులును వాటిలో ద్రాక్షరసము పోసి త్రాగిరి. వారు బంగారు వెండి యిత్తడి యినుము కఱ్ఱరాయి అను వాటితో చేసిన దేవతలను స్తుతించుటవలన దేవుని ఉగ్రతకు గురియై తన రాజ్యమును కోల్పోయి ఆ రాత్రే మరణించెను. మద్యపానమనే పాపంచేసి రాజగు బెల్షస్సరు శరీర మరణమును కొనితెచ్చుకొనెను (దానియేలు 5 అధ్యాయము). 1 సమూ 25 : 36, 1 రాజులు 16:8, 9 1 రాజులు 20 : 16).

## 3. త్రాగుబోతులు దరిద్రులై పోతారు

భారతదేశం ఒకప్పుడు అన్నపూర్ణగా, రత్నగర్భగా ఉండేది కాని ఈనాడు పేదరికం భారతదేశాన్ని పట్టి పీడిస్తుంది. దీనికి తోడుగా మద్యపానం సామాన్య మానవుడి కాయకష్టాన్ని దోచుకొని కటిక దరిద్రుల్ని చేస్తుంది. కటిక దరిద్రుల్ని బికారులుగా, బుక్కా ఫకీర్లుగా మార్చి ఏ మనిషి ఈ మద్యాన్ని సృష్టించాడో ఆ మనిషినే పీల్చి పీల్చి పిప్పి చేస్తుంది. మన రక్షకుడైన క్రీస్తువారి రాకడ ఎప్పుడో ఎవరికి తెలియదు. కనుక ఆయన బిడ్డలమైన మనము పరిశుద్ధులుగా సిద్ధపడియుండవలెను. "అయితే దుష్టుడైన యొక దాసుడు నా యజమానుడు ఆలస్యం చేయుచున్నాడని తన మనస్సులో అనుకొని తన తోడి దాసులను కొట్ట మొదలు పెట్టి, త్రాగుబోతులతో తినుచు త్రాగుచునుండెను ఆ దాసుడు కని పెట్టని దినములోను వాడు అనుకొనని గడియలోను వాని యజమానుడు వచ్చి వానిని నరికించి వేషదారులలో కూడా వానికి పాలు నియమించును. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు నుండును" (మత్తయి 24:49-50). "మరియు మద్యముతో

మత్తులై యుండకుడి దానిలో దుర్వ్యాపారము కలదు (ఎఫెసీ 5:18). మనము పరలోకరాజ్యానికి వారసులం కావాలంటే "మనము పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితో కూడిన ఆటపాటలు త్రాగుబోతుల విందులు చేయదగని విగ్రహపూజలు మొదలైన వాటియందు నడుచుకొనుచు అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును" (1 పేతురు 4:3-5). సంఘ పెద్దలు పరిచారకులు, సేవకులు త్రాగుబోతులుగా అసలు ఉండకూడదు (1 తిమోతి 3:3, 8; తీతు 1:7, గలతీ 5:19-21).

4. నిన్ను నీవే పరీక్షించుకో :— సంతోషము, బాధ దుఃఖము, నాగరికత పేర్లతో త్రాగి అనాగరికులు కావద్దుసుమా! నిజమైన సంతోషం ఆయన శరీరమైన సంఘముతో ఉంది. కనుక ఆయన కుమారులుగా కుమార్తెలుగా పరిశుద్ధ క్రైస్తవ జీవితాన్ని జీవిద్దాం. మద్యపానమును నిషేధించి మన ప్రభు రాజ్యవ్యాప్తికై పాటుపడదాము. ప్రియ మిత్రమా నిన్ను నీవే పరీక్షించుకొని ఆయన రాకడకు సిద్ధపడు. క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి.

—పి. చంద్రశేఖర్, ధవళేశ్వరం.

Regd. No. H/KD—45/KD H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No. ............

To ............
............
............
............